పరమసంత్ పరమదయాళ్
పండిత్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

# సత్సంగ సుధ

(రెండవ భాగము)

అనువాదం

జ్యోతిరాణి

ప్రోత్సాహకులు


దయాళ్ శివమంగళ్ సింహ మహారాజ్

ప్రకాశకులు

శివ సాహిత్య ప్రకాశన మండలి

రాధాస్వామి సత్సంగ భవనం

ప్లాట్ నం.7, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్



పరమ సంత్ పరమ దయాళ్ పండిత్ ఫకీర్ చంద్ జీ మహారాజు
హుష్యార్‌పూర్ (పంజాబ్)

परम संत परम दयाल पंडित फकीरचन्दजी महाराज हुष्यारपूर (पंजाब)

# మంగళాచరణము

మంగళం గురుదేవ మూరతి, మంగళం పదపంకజం
మంగళం అవ్యక్త అనుపమ, మంగళం భవగంజనం

మంగళం ధుర్ పద నివాసీ మంగళం సత్ ఆసనం
మంగళం నిర్వాణ సద్గతి మంగళం జనరంజనం

మంగళం జ్ఞానాస్వరూపమ, మంగళం ఆనంద రూప్
మంగళం చైతన్య సదనమ, మంగళం సత సత్యభూప్

మంగళం యోగేంద్రమాయా, తీత మంగళ దాయకం
మంగళం సంసారసారమ అద్భుతం మునినాయకం

మంగళం త్రైగుణ రహిత అపరోక్ష ప్రోక్షనివాసనం
మంగళం త్రైకాల జ్ఞాతా మంగళం భవనాశనం

ఆది కారణ మూలకారణ మధ్య ఆది అనంతజో
మంగళం కరుణా సదన శుభ తత్వ పరమ జగత్ప్రభో

ఆప్ ప్రగటే ఇస్ జగత్‌మే జీవ కాజ సుధారనే
శబ్దనావ బనాయ సుందర జీవ దుఃఖిత ఉబార్‌నే

ప్రాణ్ తన్ మన్ కర్మవాణీ సబ్‌హై అర్పణ్ కీజియే
క్షైహుం శరణాగత తుమ్హారా దాస్ అప్నా కీజియే

రాధాస్వామీ రాధాస్వామీ రాధాస్వామీ జప్ సదా
త్యాగ్ జగ్‌కే మోహ ధంధే పావూం భక్తి సంపదా

## దాతా దయాళ్ పరమదయాళ్ మహారాజ్‌ను ఉద్దేశించి ఇచ్చిన

## జ్ఞాన విచారం

ఫకీరా రూప్ తేరా అతి ప్యారా ॥

తూ సత్ చిత్ ఆనంద్‌కీ మూరత్, తూ తీనోం సేన్యారా ।
తేరీ గతిమతి బుద్ధిన జానే, అటక్ రహీ మంఝ్ ధారా ॥1॥ ॥ఫకీరా॥

కరమ్ కియా సత్‌కే చఢా ఘాటీ, చిత్‌మే వివేక్ విచార ।
సత్త్ చిత్త్ ఆనంద విలాసా, చహుందిస్ హరష్ పసారా॥2॥ ॥ఫకీరా॥

తీన్ త్యాగ్ చౌథేకోధారే, సో సబ్‌కా ఆధారా ।
ద్వంద్వ జగత్ త్రిపుటీకీ త్రికుటీ, ఛోడ్ చలా ఘర్‌బారా॥3॥ ॥ఫకీరా॥

నహింతూదోయ్‌న తీన్ చార్‌హై నహిం తూసహస్ హజారా ॥
ఏక్ఏక్ హై ఏక్ ఏక్ హై జానే జానన్ హారా ॥ 4 ॥ ॥ఫకీరా॥

ఏక్ అనేక్ కహేం హై తుఝ్‌మే యహభీ భూల్ వికారా
రాధాస్వామి దయా రూప్ లఖ్ అప్‌నా, తూవ్యాపక్ సంసారా॥5॥ ॥ఫకీరా॥

## చేతావని

తూతో ఆయా నర్ దేహీమే ధర్ ఫకీర్‌కా భేసా ।
దుఃఖీ జీవ్ కో అంగ్ లగాకర్ లేజా గురు కీ దేశా ॥1॥

తీన్ తాప్‌సే జీవదుఃఖీహై నిబల్ అబల్ అజ్ఞానీ
తేరా కామ్ దయాకా భాయీ నామ్‌దాన్ దే దానీ ॥2॥

తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ దేహీ ।
జగ్ కళ్యాణ్ జగత్‌మే ఆయా పరమదయాల్ సనేహీ ॥3॥

జో ఫకీర్ మోహే దర్శన్ దేవే అప్నా భాగ్ సరాహూం
అపనీ తన్‌కీ చామ్‌కీ జూతీ పగ్ ఫకీర్ పహనావూ ॥4॥

మై నహీ రామకృష్ణకా సేవక్ ఈశ బ్రహ్మ నహిం జానూ ॥
మై ఫకీర్ కానామ్ దివానా సబ్‌సే బఢ్‌కర్ మానూ ॥5॥

# పరమ దయాల్ మహారాజ్

## ప్రతి సత్సంగంలోనూ పంచిన ఆణిముత్యాలు

1. సదా శుభసంకల్పం చేయాలి.

2. నీ కెవరిమీద విశ్వాసం కుదిరితే వారి నొక్కరినే పరిపూర్ణంగా విశ్వసించు. ఈరోజు దేవిని, రేపు రాముని, ఎల్లుండి కృష్ణుని లేదా బాబాజీని కొలిస్తే రెంటన చెడ్డ రేవడివి అవుతావు.

3. నీ స్వార్థంకోసం ఎవరినీ మోసం, దగా చేయకూడదు.

4. అన్యాయంగా ఇతరుల సొమ్ము కైవసం చేసుకోకూడదు.

5. ఎవరితిండి వారే సంపాదించుకుని తినాలి.

6. స్త్రీలే జాతి నిర్మాతలు. సత్సంతానాన్ని కనండి.

7. సత్యమైన సత్పురుషుడైన సద్గురువు శరణు వేడుకోవాలి. దొంగ గురువుల నుండి తప్పించుకోవాలి.

8. నామం జపించేముందు నీవు నిష్కల్మశుడవై, నిజాయితీపరుడవు కావాలి. మనసు పవిత్రంగా వుంచుకో. లేదా ఆ నామమే నిన్ను తినేస్తుంది. నీయత్‌కో సాఫ్ రఖో.

9. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అభ్యాసం చేయండి.

10. గురుచరణాలే ప్రకాశం, జ్ఞానం, వివేకం, బుద్ధులే (సమర్థ) గురునామం. అంతరంలో ప్రకాశ దర్శనం చేసుకొనండి.

11. ప్రతిరోజూ దానం చేయండి. మీ పేదరికం దూరం అవుతుంది.

12. ఇళ్లలో శాంతి నెలకొనేలా చూడండి. కలహాలు జరిగే ఇంట్లో ఏదో ఒక ఆపద, నష్టం సంభవిస్తుంది.

13. జైసా కరోగే వైసా భరోగే.

14. నీ కేది లభించినా అది పూర్వజన్మలోనో లేదా ఇప్పటి జన్మలోనో చేసిన కర్మఫలమే తప్ప నిన్నెవ్వరూ సుఖపెట్టరు, కష్టపెట్టరు.

15. పూర్ణ విశ్వాసంతో గురువుని అంతరంగంలో దర్శింపచేసుకొని జననమరణాల చక్రం నుండి విముక్తి పొంది నిజగృహానికి చేరడానికి యత్నించాలి.

16. నేనెవర్ని, ఎక్కడ నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? అసలైన భగవంతుడెవరు? ఎక్కడుంటాడు? నిజగృహానికి నేనెలా చేరుకోగలను? అని ప్రతి మనిషీ ఆలోచించాలి.

17. గురువుని మనిషి అని భావించకు. ఆయన పరిపూర్ణ సర్వాధారుడైన పరమాత్ముడని భావిస్తేనే నీవు ఇహపరాలలో జయం పొందుతావు.

18. మానసిక, శారీరక బ్రహ్మచర్యాన్ని పాటించు.

19. మనస్సు, వాక్కు, కర్మల ద్వారా శుద్ధంగా పవిత్రంగా ఉండాలి.

20. మానవా ! మనిషివి కమ్ము ! ఇన్సాన్‌బనో, బీమాన్.

21. క్షమ, ప్రేమ, శుభ సంకల్పం, శరణాగతి, నిష్కామకర్మ, బ్రహ్మచర్య పాలన నిన్ను ఉద్ధరిస్తాయి.

22. సంత్ మతంలోకి రాదలిస్తే ముందుగా మాంస భోజనం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం వంటి అలవాట్లను విడిచిపెట్టు.

23. ఎవరికైనా బాకీ వుంటే వెంటనే ఇచ్చేయి. ఎగ్గొడితే ఆ పాపకర్మనుండి నిన్ను ఏదేవుడూ, ఏ గురువూ, సంత్ మహాత్ముడూ రక్షించలేడు. మరో జన్మలోనైనా ఈఋణాన్ని తీర్చుకోక తప్పదు.

24. సజ్జన సాంగత్యంలో ఉండాలి. మనమందరం ప్రకాశ స్వరూపులమే !

25. సత్యమైన పరమ తత్వాధారుని చేరుకోవాలనే తపన కలిగినవారే దుఃఖ జీవులు, వారిని గురుదేశానికి తీసుకుపొమ్మని దాతా నన్ను ఆదేశించాడు.

# ఇటార్సీలో ఇచ్చిన సత్సంగం తేది: 06-03-1975

నేను హనుమకొండకి వచ్చినప్పుడల్లా ఇటార్సీకి కూడా వస్తూ ఉంటాను. స్టేషన్‌కు రాగానే వందలాది మంది నన్ను చుట్టుముడతారు. ఇక్కడ ఇప్పుడు మీరు సత్సంగం ఏర్పాటు చేశారు. చూడండి! ఎంత మంది వచ్చారో? ఇక్కడే కాదు నేనెక్కడికి వెళ్ళినా ఎందరో వస్తుంటారు. ప్రాపంచిక కలహాల గురించో, ఇల్లు కావాలనో, పిల్లల పెళ్ళిళ్ళు కాలేదనో, మనుమడు పుట్టలేదనో, పేదరికం పోవాలనో, మరొకటో మరొకటో చెబుతుంటారు. నేను ఇవన్నీ నెరవేర్చాలని ఆశిస్తారు. నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను. "ఫకీర్‌చంద్! గురువు వయ్యావా ముసలివాడా"? అని; నేను గానీ మరో గురువుగానీ ఏమైనా మీకు ఇవ్వగలమా? ఇదొక ప్రశ్న.

జొగింద్రసింహ్! వింటున్నావా? నీకే చెబుతున్నాను. నీ వల్లనే ఈ సత్సంగం ఏర్పాట్లు జరిగాయి. నీవు హోషియార్‌పూర్‌కి వచ్చావు. నేను ఈ గురుపదవిని గొప్ప కోసమో, పేరు ప్రతిష్ఠల కోసమో స్వీకరించలేదు. గౌరవం కోసం, ధనం కోసం గురువు పీఠమెక్కలేదు. నాలో చిన్న నాటి నుండి ఏదో అన్వేషణ ఉండేది. అది గృహాన్ని చేరుకోవాలనే తపనే అనుకోండి! భగవంతుని కలుసుకోవాలనే జిజ్ఞాసే అనుకోండి! శాంతి కోసమే అనుకోండి! నిర్వాణ పదప్రాప్తి కోసమే అనుకోండి! భక్తి, ముక్తి, జ్ఞానాల కోసమే అనుకోండి! ఏదైనా అనుకోండి! నాలో ఒక అన్వేషణ ఉండేది. నేను సాధారణ హిందువుని. రాముడు, కృష్ణుడు, దేవి, దేవత, భగవంతుని నమ్మేవాణ్ణి. నా అదృష్టం నన్ను దాతా దయాలుని చరణాలలోనికి తీసుకుపోయింది. అక్కడ నాకు సంత్‌మతం, రాధాస్వామి మతం, కబీర్ మతం లభించింది. నేనే వస్తువుని పొందాలని వెళ్ళానో అది నాకు దీని ద్వారా లభించాలని దాతా నాకీ బాధ్యత అప్పగించాడు. ఆ బాధ్యతా నిర్వహణ క్రమంలో నేను ఈ పనిని అంటే గురుత్వాన్ని స్వీకరించి, సత్సంగాలు చెయ్యటం ప్రారంభించాను. ఇప్పుడు మీరు నా దగ్గరికి వస్తుంటారు. ఇతర గురువుల దగ్గరికి కూడా వెళ్తుంటారు. నేను నా ఆత్మను ప్రశ్నిస్తుంటాను; నేనో మరో గురువో మీకు సంపదల్నో, కొడుకులనో ఇవ్వగలుగుతామా? ఎవరి రోగాలనైనా దూరం చెయ్యగలుగుతామా? ఇదొక ప్రశ్న.

నేను దీనికి సమాధానం ఔననీ, కాదని కూడా చెబుతాను. అవునని

ఎందుకంటున్నానంటే ఎవరి అదృష్టంలో, భాగ్యంలో ఆ వస్తువు దొరికేది ఉంటుందో, కోరిక సఫలమయ్యే అవకాశం ఉంటుందో వారికి విశ్వాసం దృఢంగా కలుగుతుంది. వారి విశ్వాసం వల్లనే వారి కోరికలు నెరవేరుతాయి. ఇది నా అనుభవం. ఎవరి అదృష్టంలో, భాగ్యంలో ఆ కోరిక తీరే అవకాశం ఉందో, ఆ వస్తువు దొరుకుతుందో వారే నా దగ్గరికి గానీ, మరో సంతు దగ్గరికి గానీ వెళ్తారు. ఇతరుల సంగతి నేను చెప్పనుగానీ . . . నా అనుభవంలోకి వచ్చిన విశేషాలే విన్పిస్తాను. నేను ఏదైనా పలికినప్పుడు వాళ్ళు దానిపై దృఢమైన విశ్వాసం పెంచుకుంటారు. వాళ్ళ కోరిక నెరవేరుతుంది. విశ్వసించని వారికి ఏమీ దొరకదు. ఇది అక్షర సత్యం.

ఎవరి కోరికైనా ఫలించే అవకాశం ఉంటేనే సంతుల నోట ఆశీర్వాదం, అభయం వెలువడుతుంది. లేకుంటే లేదు. నా దగ్గరికి కరీంనగర్ నుండి శ్రీ వెంకటయ్య వచ్చాడు. ఈయన కోటీశ్వరుడు. మిల్లులు ఉన్నాయి. 10,15 లక్షల విలువగల భూములున్నాయి.అతనికి నలుగురు అన్నదమ్ములు. వ్యాపారం చేస్తారు. ఇతను కొన్ని సంవత్సరాల క్రితం నా గురువు దాతాదయాల్ మహారాజ్ సమయంలో చిన్న చిల్లర కొట్టు పెట్టుకునేవాడు. తిని, తాగే వస్తువుల్ని అమ్మే దుకాణం తెరుచుకుని కూర్చుని ఉన్నాడో రోజు. దాతాదయాల్, నందూ భాయి అక్కడి నుండి కాలినడకన వెళ్తున్నారు. దాతాదయాల్ ఒక సంత్ అని వెంకటయ్య అంతకు ముందే విన్నాడు. దాతాను చూడగానే ఇతను లేచి నిల్చుని, చేతులు కట్టుకుని తన తువాలు పరిచాడు. వాళ్ళు కూర్చున్నారు. దాతా పావలా ఇచ్చి శనగలో మరేవో ఇతని దగ్గర కొన్నాడు. తను తిని, ఇతరులకి ప్రసాదంగా పంచి పెట్టాడు. వెంకటయ్య దాతాతో, "మహారాజ్! పేదవాణ్ణి. నలుగురం అన్నదమ్ములం. తినడానికి దొరకదు. ఏం చెయ్యాలి?" అన్నాడు. దాతా దయాల్ భాయి నందు సింహ్ నుండి ఒక రూపాయి నాణాన్ని తీసుకుని వెంకటయ్య కిచ్చి, "దీన్ని నీ దగ్గరే ఉంచుకో ఒక్కసారి కళ్ళెత్తి చూడు. నీ చూపు ఎంత దూరం ప్రసరిస్తే అంత వరకు చూడు. కనుచూపు మేర వరకు చూడు" అని చెప్పాడు. ఆ రోజుల్లో ఇప్పటిలా ఇంత జనం లేరు. కనుచూపు మేర వరకు చూశాడితడు. "ఎంత స్థలం వరకు నీ చూపు పాకిందో ఇదంతా నీదే అవుతుంది" అన్నాడు దాతా. నేడు ఈయన అంత స్థలానికీ యజమాని అయ్యాడు. నేనిప్పుడు ఆలోచిస్తుంటాను, ఒకవేళ దాతాదయాలే ఇతనికి ఇచ్చినట్లయితే మిగిలిన వాళ్ళకెందుకివ్వలేదు? దాతా ఈ మాటలు చెప్పక ముందు వెంకటయ్య ఆయన కేం సేవలు చేశాడు? ఏ సేవలూ చెయ్యలేదు కదా! విషయం అర్థమవుతోందా? "కళ్ళెత్తి చూడు! ఈ స్థలమంతా నీదే అవుతుంది" అని దాతా అనకముందు ఇతను ఆయన్ని

కలుసుకోలేదు. సేవించలేదు. అర్థం కావటం లేదా? నా జీవనంలోని అనుభవం, సంతుల విషయం గమనిస్తే నాకు ఒక్కటే అన్పిస్తోంది, "ఎవరి అదృష్టంలోనైనా ఆయా వస్తువు రాసిపెట్టి ఉంటేనే సంతుల నోటివెంట ఆశీర్వాదం వెలువడుతుంది. జరగబోయే అంశాన్నే భగవంతుడు వారి నోటివెంట పలికిస్తాడు. లేకుంటే లేదు. ఇది నేనెందుకు చెబుతున్నానో తెలుసా? "నాకు సంతు మతం ద్వారా ఏది బోధపడినా, లోకానికి చెప్పి పోతానని" ప్రతిజ్ఞ చేశాను ఇది నా కర్మభోగ్ - అందుకే నేనీ కర్తవ్యం నిర్వర్తిస్తున్నాను. శరీర త్యాగం చేసే ముందు శిక్షణలో మార్పు తెమ్మని దాతా నన్ను ఆదేశించాడు. ఏ విషయమైన సఫలమయ్యేదైతేనే సంత్ నోటి వెంట వస్తుందని నాకు బోధపడింది.

కొందరు పాఖండి గురువులు ప్రాపంచిక గౌరవ మర్యాదల కోసం, ఇతరుల్ని సంతోష పెట్టటం కోసం ఆశీర్వదిస్తుంటారు. ఇళ్ళ ముందరి కొచ్చే సాధువులు అడగక పోయినా నీ సంతానం బాగుండాలనీ, నీకు మేలు జరగాలనీ దీవిస్తుంటారు. వీరు మహాత్ములు కారు. "ఫకీర్‌చంద్! ఈ సాలెగూడును నువ్వెందుకు ఏర్పర్చుకున్నావ్?" అని ఆలోచిస్తుంటాను. మీరు ప్రాపంచికులు ప్రాపంచిక సంబంధమైన కోరికలే తీర్చమని, నెరవేర్చమని నన్ను కోరుతుంటారు. ఇది సరే! కానీ మీరంతా ఒక్క విషయం గుర్తుంచుకోండి! నీ కర్మఫలితాన్ని మాత్రం ఎవరూ మార్చలేరు. ఈ విషయం మరవవద్దు.

పాకిస్తాన్‌లో శాహకాకూ అనే ఒక ఫకీర్ ఉండేవాడు. తరువాత కాలాశాహ కాకూ అనే పేరుతో పిలవసాగారతన్ని. ఆయన చాలా సాధన చేసిన వ్యక్తి. గమ్యం చేరుకున్న గొప్ప సాధకుడు. ఆయన ఆశ్రమానికి ఒక కంజరియా వచ్చేది. ఆమె శ్రీమంతురాలు. ఆమె గజళ్ళు పాడేది. ఆమె సేవా భావనకి సంతోషించిన శాహకాకూ, "అమ్మా! నీ శ్రద్ధా భక్తులు మెచ్చుకోదగినవి. అడుగు! ఏం కావాలో? నీ కోరిక తీరుస్తాను" అన్నాడు ఓ రోజు. "అడుగు! ఏం కావాలో? నీ కోరిక తీరుస్తాను" మళ్ళీ అన్నాడు ఆ ఫకీర్.

"సాయీ! నీవిచ్చింది చాలా ఉంది - నా జీవనం గడవడానికి . నాకింకేం వద్దు . . ." అందామె.

"అలా కాదు. అడుగు ఏం కావాలో . ." బలవంత పెట్టాడు శాహకాకూ.

"సరే! అయితే నా అదృష్టంలో రెండు రొట్టెలు ఉంటే వాటిని ఒకటిగా గానీ, మూడుగా గానీ మార్చండి . . ." అంది.

అప్పుడు గానీ శాహకాకూ కళ్ళు తెరుచుకోలేదు. ఆ తరువాత ఆయన పదేళ్ళు జీవించాడు. అవమానభారంతో, తలవంచుకుని జీవించాడు.

"ఖుదాకా హుకుంవాలా-శాహకాకూ కా ముఁహ కాలా" అనేవారతన్ని అందరూ !

అందుకే నేనంటాను, "ఓ అమాయక జీవులారా! మీరంతా ప్రాపంచిక వస్తువులు కోరుకోవడానికి మందిరాలకి, మజ్జిద్‌లకీ వెళ్తుంటారు. గురువులను దర్శిస్తుంటారు. నీకు ఏది లభించినా అది నీ కర్మఫలితమో, శ్రద్ధా విశ్వాసాల ఫలమో అయివుంటుంది. ఏ మహాత్ముడూ, ఏ గురువూ ఏమీ ఇవ్వడు నీకు" ఇప్పుడు ఈ జగింద్రసింహ రోగగ్రస్తుడై ఉన్నాడు. నన్నెంతో ప్రేమించే వ్యక్తి. మనస్ఫూర్తిగా సేవిస్తుంటాడు. నేను వచ్చినప్పుడు మందిరం కోసమని డబ్బులిస్తుంటాడు. అదిగాక 'సత్సంగ మండలి' నుండి వసూలయిన మొత్తాన్ని కూడా యిస్తాడు. నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను. "నీవేమైనా చెయ్యగలగితే ఇతని వ్యాధిని తొలగించు" అని. ఎలా చెయ్యగలను? సరే! ఈ సంగతి అలా ఉంచండి. ఎందరో సంతులు రోగగ్రస్తులయ్యారు. తమ వ్యాధిని తామే తరిమికొట్టలేక పోయారు. తన రోగాల్నే దూరం చేసుకోలేని సంతులు, మహాత్ముల ఇతరుల రోగాల్ని నయం చెయ్యగలరా? ఇది అసాధ్యం. బాబా సావన్ సింహజీ, స్వామీ రామకృష్ణ పరమహంస మొదలైన వారు కూడా రోగాలతో బాధపడి కర్మ ఫలమని అనుభవించారే తప్ప తప్పించుకోగలిగారా?

యేసు ప్రభువును శిలువ వేశారు. మేకులు కొట్టారు. ఆయన తప్పించుకోగలిగాడా? ఓ మానవా! జరుగుతున్నదంతా ఏమిటి? ప్రతి వ్యక్తి తన కర్మఫలమే అనుభవిస్తున్నాడు. గృహస్తులారా! మీరు ప్రపంచంలోని ఆశల వలలో, మోహాల వలయంలో చిక్కుకుని మందిరాలకు, మసీదులకు, గురువుల దగ్గరికి వెళ్ళి ప్రాపంచిక వస్తువుల్ని కోరుకుంటూ ఉంటారు. ఎవరూ మీకు ఏమీ ఇవ్వరు. మీకేదైనా లభించాలంటే అది మీ కర్మల నుండే సాధ్యపడుతుంది. మీ విశ్వాసం వలన దొరుకుతాయి. అది లభించడానికి నేనొక పద్ధతి చెబుతాను. ఆ పద్ధతి నాకు మీ నుండే బోధపడింది. ఎలా? నా దగ్గరికి ఎన్నో ఉత్తరాలు వస్తుంటాయి. వ్యక్తిగతంగా కూడా ఎందరో వచ్చి చెబుతుంటారు. "బాబాజీ! నాకు ఫలాన వస్తువు అవసరం ఉండేది. ఆ కోరిక తీరక పోవటంతో నేను నిన్ను ధ్యానించేవాణ్ణి. నాకా వస్తువు లభించింది. నా కోరిక తీరింది". "నా పని నెరవేరుతుందని మీరన్నారు. ఆ పని నెరవేరింది" అని చెబుతుంటారు. ఇంతకు ముందు నా

దగ్గరికి ఒక మహిళ వచ్చి మాట్లాడింది. ఆమె తన కొడుకును ఎత్తుకు వచ్చి నా ఒళ్ళో కూర్చోబెట్టింది. "ఏమిటమ్మా! ఇది?" అన్నాను. 15 సంవత్సరాల నుండి నాకు సంతానం లేదు. నేను మీ మనుష్యబనో పత్రిక చదివేదాన్ని. అది చదివాక నాకు విశ్వాసం కుదిరింది. నేను మిమ్మల్ని రోజూ ధ్యానించటం ప్రారంభించాను. నాకు కొడుకు పుట్టాలని కోరుకునేదాన్ని. ఇదిగో వీడు పుట్టాడు . . ." అంది తన కొడుకుని చూపి.

దీని రహస్యం ఏమిటి? చెబుతాను వినండి. మన ఆలోచనా విచారాలు, ఆచరణ, మనోకామనల ఫలితాలే ఈ లోకంలో మనకు లభిస్తుంటాయి. సహస్రదళకమల్, త్రికుటి స్థానాలలో ఇష్టదైవాన్ని ధ్యానించి సత్యమైన మనసుతో మీకు అవసరమైన వస్తువును, ఇమ్మని వేడుకోండి ఆ కోరిక తప్పకుండా నెరవేరుతుంది. అంతే! ఇదే గురువు. నీవు రాముణ్ణి విశ్వసించి పూజిస్తే రాముడినే ధ్యానించు. కృష్ణుణ్ణి విశ్వసించి పూజిస్తే కృష్ణుడినే ధ్యానించు. దేవిని నమ్మితే దేవినే ధ్యానించు. నువ్వెవర్ని విశ్వసించి పూజిస్తే ఆ రూపాన్ని ధ్యానించు కావలసింది పొందుతావు.

అయితే మీరంతా గుర్తుంచుకోవలసిన విషయం ఒక్కటే! ఏ గురువూ, ఏ మహాత్ముడూ, ఏ దేవీ, ఏ రాముడూ మీకు ఏమీ ఇవ్వరు. ఏ కోరికా తీర్చరు. నీ కర్మ ఫలమే నీకు లభిస్తుంది. నీ కామన, కోరిక తీరాలంటే ఆ అభిలాషను తీవ్రతరం చేసి, ప్రగాఢంగా కోరుకోవాలి అంతరంలో. సహస్రదళ కమల స్థానంలో మీ ఆవశ్యకతను నివేదించండి. అది నీకు లభిస్తుంది. ఇది నా జీవితం నాకు నేర్పిన పాఠం. నా అనుభవంలోకి వచ్చిన అంశం. నేనెన్నో సార్లు గమనించాను. నాకు ఎప్పుడు ఏది అవసరమైనా ప్రకృతి అటువంటి పరిస్థితులు కల్పించి నా అవసరాల్ని తీరుస్తుంది. నన్ను కలుసుకునే వాళ్ళూ, నా చుట్టుపక్కల ఉండేవాళ్ళూ ఆశ్చర్యపడుతుంటారు. "బాబాజీ! ఇదెలా జరిగింది?" అంటూ! ఇది ఇలా ఎందుకు జరుగుతుంటుంది? ఏ మనిషైనా ఇక్కడ ధ్యానం చేసి తన కోరికను వ్యక్తం చేస్తే అది తీరుతుంది. చెడు కోరిక ఫలితం చెడుగానే ఉంటుంది. అందుకే నేను ఎవరికీ నామదానం ఇవ్వను. చాలా మంది తమ కోరికల్ని, ఇచ్ఛను వ్యక్తం చెయ్యవలసిన పద్ధతిలో అడగరు. మంచి కోరికను కోరరు. నీవు ధ్యానం చేస్తున్నావనుకుందాం. నీ మనసులో అత్తాకోడళ్ళ మధ్య పరస్పరం ఉండే వైరభావన గానీ, భార్యాభర్తల మధ్య వైరభావన కానీ, అన్నాదమ్ముల వైరభావన గానీ ఉంటే ఆ వైరభావన, ద్వేష ప్రవృత్తి యొక్క ప్రభావం మీ సాధన సమయంలో పడి మీకు నష్టం కలిగిస్తుంది.

నేను చెప్పే విషయాల్ని విని ఊరుకోకుండా ఆచరించండి. అప్పుడే మీకు లాభం కలుగుతుంది. మీరు ఆచరించకుంటే నేనిలా అరవటం అనవసరం. మీ మీ జీవనాలు సఫలం కావాలని ముఖ్య విషయాల్ని నేను చెబుతున్నాను. మీరు నేను చెప్పే మాటల్ని విన్పించుకోరు. వాటిని విని, ఆచరిస్తే లాభం కలుగుతుంది కానీ నాకు మొక్కితే సరిపోదు. గురువు, గురుమహారాజ్ అని నా చుట్టూ తిరిగితే భవసాగరం దాటలేరు. గురువు చెబుతున్న విషయాల్ని విని దానిని ఆచరిస్తే మీరు తరించడానికి వీలుంది. మిమ్మల్ని మోసగించడానికి వచ్చే గురువుల లాంటి వాణ్ణి కాదు నేను. దాతా ఆనతి మేరకే నా జీవితానుభవ విశేషాల్ని మీకు చెబుతున్నాను. ఎందుకు? ఆఫ్రికా నుండి, అమెరికా నుండి తమ తమ అనుభవాల్ని తెలుపుతూ ఉత్తరాలు రాస్తుంటారు. "బాబా! నిన్ను ధ్యానించాం. మా పనులు పూర్తయ్యాయి . . ." నేను ఆయా దేశాలకు వెళ్ళలేదు. వాళ్ళెవరో కూడా నాకు తెలియదు. మరి వారి పనుల్ని ఎవరు పూర్తి చేశారు? వారి సాధనయే వారి పనుల్ని నిర్వర్తించింది. అవసరాల్ని, కోరికల్ని తీర్చింది. ఆపదల్ని నివారించింది. "జైసీ ఆసా వైసీ బాసా – జైసీ మతి వైసీ గతి, జైసీ కరనీ వైసీ భరనీ" ఎవరెలాంటి కర్మ చేస్తే అటువంటి ఫలితం పొంది తీరవలసిందే తప్పదు. నేనెవరికీ నామం ఇవ్వను. కేవలం సత్సంగం చేస్తానంతే! ఎందుకు? సత్సంగం జరగకుంటే మన నడవడిలో, ప్రవర్తనలో పొరపాట్లు జరగవచ్చు. మనసుల్లో ద్వేషాలు పెంచుకుంటాం. అభ్యాసం చేసేటప్పుడు మనసులోని ద్వేషం పెరిగిపోతుంది. ఎవరి పట్లనైతే నీవు విరుద్ధ, ద్వేష వైర భావనతో ఉన్నావో వారికే నష్టం కలుగుతుంది. నీకూ నష్టం కలుగుతుంది. నేను మీకు చెప్పదలచుకున్న 'రహస్యం' ఇదే! కానీ మీరు దీన్ని గ్రహించటం లేదు. స్వీకరించటం లేదు. అజ్ఞాన భక్తి, మూఢ భక్తి చూపిస్తూ నా సమయం వ్యర్థం చేస్తారు.

ప్రాపంచిక వస్తువుల్ని గానీ, పరమార్థాన్ని గానీ పొందడానికి ఏం కావాలి? ఏది అవసరం? మీ ఇష్ట దైవాన్ని పరిపూర్ణుడన్న సంపూర్ణ నమ్మకంతో ధ్యానించండి. మీ ధ్యానం కుదిరితే మీ కోర్కెలు ఫలిస్తాయి.

ఈశ్రగోవర్ కూర్చుని ఉన్నాడు. మామ్‌చంద్ పోయాక అతను నిర్వర్తించిన విధుల్ని ఇతను చూస్తున్నాడు. ఈశ్రగోవర్ రైల్వేలో గార్డుగా పని చేశాడు. ఇతనెన్నో తన స్వీయానుభవాల్ని చెప్పాడు. ఇతను ఒకసారి రైల్లో బ్రేక్‌లో కూర్చున్నాడు. కొందరు పిల్లలు గొలుసులు లాగి రైలును ఆపించసాగారు. ఇతను వారిని వారించగా ఇతన్ని కొట్టబోయారు. తనెంతగానో బాధపడ్డానని చెబుతూ, "బాబా! నిన్ను తల్చుకున్నాను. నువ్వొచ్చావు. ఇట్లా కాదు. నువ్వు ఈ

విధంగా అంటే మరొక రకంగా పనిచెయ్యి అని చెప్పావు . . ." అన్నాడు. మరి నేను వెళ్ళి అతనికి సాయపడలేదే? అందుకే మీకు చెబుతుంటాను. ప్రస్తుతం సాధువులు, గురువులు, మహాత్ములు, గృహస్థుల్ని మూర్ఖుల్ని చేసి దోచుకు తింటున్నారు. మరి నేనతని వద్దకు పోనప్పుడు ఇతనికి ప్రత్యక్షమై సరైన సలహాను ఇచ్చి, మార్గం చూపినవారెవరు? ఇతనిలో విశ్వాసం గాఢంగా ఉంది. గనుక తనకు ఆపద కలిగినప్పుడు, ఇతని మేధస్సు లోపల సురత్ తనంతట తానే పైకి వెళ్ళింది. అధిరోహించింది. నన్ను ధ్యానించాడు గనుక నా రూపం ప్రకటమైంది. ఇతని సమస్య తీరి మనోకామన ఫలించింది. ఇవన్నీ మీకు రుజువు కోసం చెబుతున్నాను.

అందుకే బిడ్డలారా! మీరు ప్రపంచంలోని ఆశలు తీరడం కోసం గురువుల దగ్గరికి వెళ్ళి సాగిలపడి నసిగే బదులు గురువు నుండి జ్ఞానాన్ని తీసుకొనండి. నేను గురు మహిమను ఎరిగినవాణ్ణి. గురువు జ్ఞానం ఇస్తాడు. రహస్యం బోధపరుస్తాడు. మీ ఆశను, కోరికల్ని మనసులో ఉంచుకొని మీ చిత్తవృత్తుల్ని ఏకత్రితం చేసి ధ్యానం చేయండి. నువ్వు రాజువు కావాలనుకున్నా అవుతావు. కాని దానికి కొంత సమయం పడుతుంది. ఈ జన్మలో సాధ్యపడకపోతే మరు జన్మలోనైనా నువ్వు రాజువై తీరుతావు. ఫలించదన్న ప్రసక్తే లేదు. మీ కోరిక అవశ్యం ఫలిస్తుంది. ఇది ప్రకృతి నియమం. భగవన్నిర్ణయం. కానీ నువ్వు కోరిన కోరిక నీ కోసం కాక ఇతరుల కోసం నువ్వు కోరితే పూర్తి కాక పోవచ్చు. నా దగ్గరికి ఎందరో వస్తుంటారు. మా అబ్బాయికి ఉద్యోగం కావాలి, వ్యాపారం వృద్ధి చెందాలి, వగైరా వగైరాలు కోరుతూ ఆ కొడుకు తన పని కావాలని కోరుకోవటం లేదు. తల్లి కోరుకుంటోంది. అతనికేం లాభం. కానీ కొన్ని సందర్భాల్లో తల్లి కోరిక ప్రగాఢంగా ఉంటే అది తీరవచ్చు. అది వేరే విషయం.

పూర్వకాలంలో గురువులు, పురోహితులు, యజమానికి హితైషులుగా ఉండేవారు. గృహస్థుల దుఃఖాన్ని కష్టాల్ని దూరం చెయ్యటమే వారి కర్తవ్యం. వాళ్ళు అభ్యాసంలో ధ్యానమగ్నులై యజమానుల శ్రేయస్సు కోరేవారు. వారి ధ్యానం వలన యజమానికి లేదా రాజుకి లాభం కలిగేది. కానీ మనలో అంతటి సంకల్ప శక్తి ఎక్కడిది?

ఈ రోజు ఉదయం ఎందరో స్త్రీలు ఫిర్యాదు చేశారు, తమకు అంతరంలో ధ్యానం, అభ్యాసం కుదరటం లేదు. అభ్యాసం చేయడానికి ముందు కొన్ని షరతులు, నియమాలు పాటించనంతవరకు ఎవరికీ అభ్యాసం కుదరదు. ఎవరైతే

పరమార్థం, శాంతిని కోరుతూ ఈ ప్రపంచంలోని జనన మరణాల నుండి విముక్తులు కావాలనుకుంటారో, నిజగృహానికి వెళ్ళాలనుకుంటారో వారికి అభ్యాసం అవసరం. నిజగృహం వెళ్ళడానికి ఎటువంటి వారు అర్హులు? స్వామీజీ మహారాజ్ వాణి ఇలా ఉంది.

"కోమల్ చిత్ దయా మన్ ధారో
పరమారథ్ కా ఖోజ్ లగానా"

ఇదే నియమం. మనిషి కోమలచిత్తుడు కానంత వరకు, మనసులో దయాభావన రానంత వరకు ఏమీ దొరకదు. అతను ఫకీర్‌చంద్ శిష్యుడైనా కానీ, మరో మహాపురుషుని శిష్యుడైనా కానీ . . . కోమల చిత్తం లేకుంటే ఏమీ సాధన చెయ్యలేడు. కోమల చిత్తం అంటే ఏమిటి? ఎలాంటిది? దేనిని కోమల చిత్తం అంటారు? నేనొక ఉదాహరణ చెబుతాను. ఒక చెట్టుందనుకోండి! దీని చిటారు కొమ్మలోని ఆకులు మెత్తగా ఉంటాయి. గట్టిగా ఉండవు. ఎటుకావాలంటేఅటు వంగుతాయి. అలాగే మనసులో ఏ మాత్రం నీకు అహంకారం ఉన్నా కోమల చిత్తం ఏర్పడదు. చిత్తం కోమలంగా, మృదువుగా, దయావంతంగా కాజాలదు. డబ్బుందన్న అహంకారం నీలో ఉన్నంత వరకు కోమల చిత్తుడవు, దయామూర్తివి కాలేవు. నీ ఉన్నత పదవి పట్ల గానీ, నీ ఉన్నత విద్య పట్ల గానీ అహంకారపడితే కోమల చిత్తుడవు కాలేవు. అందుకే ఏ మనిషైనా అన్ని రకాల అహంకారాలు విడనాడిన తరువాతనే సాధన, భజన చెయ్యడానికి సమర్థుడవుతాడు. అహంకారం కించిత్తయినా లోపల ఉంటే ఇతను సాధన చేయబోయినా అది కుదరదు. ఇతరులకు ఉపదేశాలిస్తూ, గద్దెలెక్కి ఉపన్యాసాలు చెప్పినా ఏం చేసినా అభ్యాసం కుదరనే కుదరదు. నేను అబద్ధం చెప్పను. ఒకటి కోమల చిత్తం కావాలి. రెండు దయ.

"కోమల్ చిత్ దయా మన్ ధారో
పరమారథ్‌కా ఖోజ్ లగానా"

ఈ రెండూ నీలో ఉన్నప్పుడే పరమార్థం వైపుకు నడవగలవు. అసలు పరమార్థం అంటే ఏమిటో, పరమాత్మని ఎలా చేరుకోగలవో అన్వేషించగలుగుతావు.

ఇక 'దయ' విషయాన్ని చూడండి. మీ జీవితాల్ని చూడండి.. మీ ఇంట్లో చిన్న చిన్న పిల్లలుంటారు. వాళ్ళు తెలిసీ తెలియక ఏవో తప్పులు చేస్తుంటారు. తల్లి తండ్రులు పిల్లల్ని చెడామడా తిట్టి, కొడుతుంటారు. పిల్లలు అమాయకులు.

వాళ్ళకి ఏది తప్పో, ఏది ఒప్పో తెలియదు. వారిలో బుద్ధి వికసించలేదని తెలిసి కూడా కొడుతుంటారు. ఆ సమయంలో మీలో ఏ మాత్రం దయాగుణం ఉండదు. వారిపై జాలి కలగదు. ఏ మాత్రం దయలేని మీరు, పసిపిల్లల్ని సైతం కొట్టే మీరు ఆ తరువాత అభ్యాసం సాగాలని ఆశిస్తారు. పరమార్థం పొందుతామని ఎలా అనుకుంటారు? అంతా వర్థిదే! ఆచరించాలని ఎవరూ అనుకోరు.

కొన్ని కుటుంబాల్లో అత్త కోడల్ని రాచి రంపాన పెడుతుంది. తిడుతూ ఉంటుంది. భార్య భర్తని విమర్శిస్తుంటుంది. భర్త భార్యని తిడతాడు. కొడతాడు. లేదా చంపెయ్యడానికి కూడా వెనుకాడడు. చట్టాల భయం వల్ల చంపక పోవచ్చు గానీ . . . అతని మనసులో క్రోధం, ప్రతీకారం, కక్షలు ఏర్పడుతున్నాయి. కక్ష, తీర్చుకోవాలన్న భావన మనసులో నుండి దూరం కానంత వరకు పరమార్థం దొరకదు. నేను స్పష్టంగా చెబుతున్నాను. ఎందుకంటే కొందరు సత్సంగీయులు 35-35 సంవత్సరాల నుండి వస్తున్నా ఇంకా పరమార్థం లభించటం లేదని, అభ్యాసం కుదరటం లేదనీ ఫిర్యాదులు చేస్తుంటారు. మీ పరమార్థం ఎందుకు ముందుకు సాగటం లేదో, అభివృద్ధి చెందటం లేదో చెబుతాను. మొదటిది మీకు కోమల చిత్తం లేదు. దీనికి ఏం కావాలి? ఏం చేయాలి? మనిషి మనసులోపల ఏ వ్యక్తి పట్లగానీ, బంధుమిత్రుల పట్ల గానీ, సోదరుల పట్లగానీ ప్రతీకారం తీర్చుకోవాలన్న భావన ఉండకూడదు. ఏ మాత్రం అహంకారం ఉండకూడదు. ఈ రెండు గుణాలు పూర్తిగా తొలగిపోనంతవరకు సత్సంగి పరమార్థాన్ని పొందజాలడు. ఎవరి శిష్యుడైనా అవుగాక! ఎవరైనా ఉత్తములు, తగినవారి, అర్హులైన వారి సత్సంగం మీకు లభిస్తే అతని సత్సంగం వలన మీ మనసులను నిరహంకారంగా, దయామయంగా మల్చుకునే ఆలోచన మీకు కలుగుతుంది. అప్పుడు నిన్ను నీవు మార్చుకోగలిగితే పరమార్థం లభిస్తుంది. అందుకే పదే పదే చెప్పారు .

"సత్‌గురు ఖోజరీ - జగమే దుర్లభ్ రతన్ యహీ"

ఇప్పుడు మీరే ఆలోచించండి. మీరు కొట్లాటలలో రోజులు గడిపేవ్యక్తినో, మరో ఆశ్రమాధిపతినో మీ గురువుగా భావిస్తారు. అతని శిష్యులవుతారు. గురువులు-గురువుల మధ్య స్పర్థలుంటాయి. కలహాలు జరుగుతుంటాయి. అలాంటి వారిలో ప్రతీకారం తీర్చుకొనే కోరిక ఉంది. వారి సాంగత్యంలో మీ మనస్సు ఏనాటికీ శుద్ధికాజాలదు. ఎందుకంటే ఆ గురువే కొట్లాటలలో చిక్కుకుని ఉన్నాడు. ఎవరి సత్సంగానికి వెళ్ళాలో, ఎవరి ప్రవచనాలు వినాలో జనానికి

తెలియదు. నిజంగా కొందరు మనుషులు ఎంత మూర్ఖులు అనిపిస్తుంటుంది. నా రిక్షాను భూదేవ్ అనే వ్యక్తి నడిపిస్తాడు. నేను రిక్షాలో లేకుంటే కొందరు భూదేవ్‌కే మొక్కుతుంటారు. భూదేవ్ కూడా ఎదుట లేకుంటే రిక్షాకే మొక్కి వెళ్ళిపోతారు.

ఫటీ ఆంఖ్ వివేక్ కీ, గినే న సంత్ అసంత్।
జిస్‌కే సంగ్ దస్ బీస్ హై తిస్ కా నామ్ మహంత్॥

పరమార్థం కోరేవారికి చెబుతున్నాను. సత్‌గురు ఖోజోరీ జగ్‌మే దుర్లభ్ రతన్ యహీ - సత్సంగం చెయ్యండి. ఏ సత్సంగానికి వెళ్ళటం వలన మనస్సుకు శాంతి లభిస్తుందో, మనసు స్వచ్ఛమైనట్లనిపిస్తుందో, మార్పు వచ్చినట్లనిపిస్తుందో వారి సత్సంగం చెయ్యండి. వారి సాంగత్యం వలన ఏమవుతుంది? వారు మీకేమీ ఇవ్వకపోయినా వారి సాంగత్యం వలన, వారి రేడియేషన్ వలన, వచనాల వలన మీ మనస్సుల్లోని ఆలోచనా విచారాలు మారి పవిత్రమవడానికి సాయం దొరుకుతుంది. ధైర్యం వస్తుంది. తేలికయైన మార్గం లభిస్తుంది.

చూడు జుగింద్రసింహ్! నీవు ప్రపంచాన్ని చూశావు. గృహస్తి వయ్యావు. పిల్లలున్నారు. గౌరవం, ధనం అన్నీ చవిచూశావు. ఇప్పుడు ఒక వేళ ఈ వార్ధక్య దశలోనైనా నీవు నీ భార్యా పిల్లల పట్ల మోహం తగ్గించుకోకుంటే నీ జన్మ వ్యర్థమైపోతుంది. నీవు చేసిన సత్సంగాలూ, మంచిపనులూ అన్నీ వృధా అవుతాయి. నీకొక విషయం చెబుతాను. ఈ శరీరం ఏదో ఒక రోజు పోయేదే! లోకంలో శాశ్వతంగా ఎవరున్నారు గనుక! అందరూ వెళ్ళిపోవాల్సిందే! వెళ్ళిపోయే నీకు ఈ మోహాలు, జంజాటాలు ఎందుకు? ఈ శరీరం ఆరోగ్యంగా ఉండటానికి మందులు ఇప్పించు వైద్యం చేయించు. కానీ చింతించవలసిన అవసరం ఏ మాత్రం లేదు. శరీరం విడిచి పెట్టవలసిన రోజు వస్తుంది. అందుకు సిద్ధంగా ఉండు. ఇక నీ మనసు ఉంది. దీన్ని ఫకీర్ చంద్‌తో గానీ, మరొకరితో గానీ ముడివెయ్యకు. నీకు గురువు చెప్పిన గురుజ్ఞానంతో నిన్ను నీవు బంధించుకుంటేనే నీకు లాభం కలుగుతుంది. ప్రపంచంలో ప్రస్తుతం అన్యాయం, మోసం జరుగుతోంది. ఇప్పటి గురుయిజాన్ని 420 గురుయిజం అనవచ్చు. నేను నిర్భయుడినై చెబుతున్నా. "నామదానం తీసుకో! అంత్య సమయంలో సత్‌గురువు వచ్చి తీసుకుపోతాడు" అని చెబుతారు ఈ 420 గురువులు. ఈ ఆలోచన మీలో కలిగించి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించమంటారు. తరువాత ఆ శిష్యులు ఆ ఆలోచనతోనే నామం జపిస్తుంటారు. మోసం, దగా చేస్తుంటారు. ప్రవర్తించకూడని

రకంగా ప్రవర్తిస్తుంటారు. దయాగుణాన్ని పెంచుకోరు. అహంకారాన్ని తొలగించరు. అంత్య సమయంలో గురువొస్తాడన్నారు కదా సరే! వస్తాడే అనుకుందాం! ఆ వచ్చే గురువు ఎవరు? బయటి గురువు రాడు. మీ ఇటార్సీలో కూడా ఒకరిద్దరు మరణించబోతుండగా తమ వద్దకి బాబా ఫకీర్ వచ్చాడని చెప్పారు. ఒకాయన బాబా విమానం తెచ్చి తనని అందులో తీసుకుపోతున్నాడు అంటూ విమానం నెంబరు కూడా చెప్పి, తన భార్యని కూడా రమ్మని పిల్చాడని మీరే చెబుతుంటే విన్నాను. మరి నేను రానే లేదు. ఆ విమానాన్ని తేలేదు. ఈ విషయం గురించి నాకు తెలియనే తెలియదు. మీరు చెప్పాక విని ఆశ్చర్యపోతుంటాను. మరి ఆ విమానం తీసుకుని మృత్యుముఖంలో ఉన్న వ్యక్తుల దగ్గరికి వచ్చిందెవరు? అతని ఊహల్లో, ఆలోచనా విచారాల్లో ఏ ఇష్టదైవం గురువు రూపం, నిండి ఉందో, మేధస్సులో నిక్షిప్తమై ఉన్న ఆ గురువు రూపమే అతని వద్దకు వచ్చింది ఏ వ్యక్తినైనా అంత్య సమయంలో తీసుకుపోవడానికి ఏదైనా సగుణసాకార రూపం వస్తే ఆ వ్యక్తికి మళ్ళీ జన్మ ఉంది. కాకపోతే కొంచెం మంచి శరీరం లభించవచ్చు. ఉత్తమ గృహంలో జన్మ రావచ్చు. కానీ పుట్టక తప్పదు. జనన మరణాల చక్రం నుండి బయట పడలేడు . . . మీకూ, ఇంకా కొందరు ఇతర వృద్ధులకు చెబుతున్నా! వినండి! చాలామంది మీలాగే వచ్చి చెబుతుంటారు. "బాబా ఫకీర్ పల్లకీ తీసుకువచ్చాడు. భండారాదేవి వచ్చింది . . ." అంటూ నేను భండారో నడిగాను . . . "నువ్వ వెళ్ళావా" అని. లేదంది. "భండారో! జాగ్రత్త! గురువు వయ్యావు - ఇలాంటి మాటలు విని స్త్రీల నుండి డబ్బో దస్కమో తీసుకుంటే నీ ప్రాణం పోతుంది. వీళ్ళ మాటలు నమ్మి మనం డబ్బుతీసుకుంటే, నువ్వూ నేనూ ఎక్కడికి పోతాం?" అని భండారోకి చెప్పాను.

ఈ గురువుల స్థితిని నేను మీకు వివరించాను. మరి అసలైన గురువు ఎవరు? అంటే వినండి. సత్‌గురువు కేవలం శబ్ద స్వరూపి. రాధాస్వామి దయాల్, ఆయన చరణాలు ప్రకాశం అని రాధాస్వామి మతాన్ని నడిపించిన హుజూర్ రాయ్‌సాలిగ్రాం మహారాజ్ తన 'ప్రేమవాణి' లో స్పష్టంగా రాశాడు. ఆయనే మరో చోట "అంత్య సమయంలో కళ్ళెదుట ఫిలిం నడుస్తుంది. ఎవరెవరితో ఇతనికి ఈ దేహంలో ఉండగా, ఈ జీవితంలో సంబంధబాంధవ్యాలు ఉన్నాయో వాళ్ళందరూ కన్పిస్తారు. ఏ గురువు నుండి నామం పొందాడో ఆ గురు స్వరూపం కూడా ఎదుటకి వస్తుంది. శబ్దం కూడా విన్పిస్తుంది. అయినా కొంత సమయం వరకు పైలోకాల్లో ఉండవలసి వస్తుంది. అక్కడ అతనికి గురు దర్శనం అవుతుంది. సత్సంగాలు దొరుకుతుంటాయి. ఎవరైనా సంత్ సద్గురువు వస్తే,

లభిస్తే మిగిలిన కమాయీ అంటే మిగిలిపోయిన సాధన పూర్తవుతుంది. నీది ఇదే చివరి శరీరం కావాలని నేనాశిస్తున్నాను. ఇది నా కోరిక కూడా! అందుకే నేనీ సత్సంగం ఇస్తున్నాను. ఇది నా విధిగా భావిస్తున్నాను. నువ్వు నమ్మ-నమ్మకపో దానికి నేను బాధ్యుణ్ణి కాను. గురువు జ్ఞాన స్వరూపుడు. లేదా ప్రకాశ స్వరూపుడు. నువ్వు ఏ గురువు నుండి నామాన్ని పొందావో, ఏ గురువును ధ్యానిస్తున్నావో ఆ గురువును హోషియార్ పూర్‌లో ఉండే ఫకీర్ చంద్ అనో, బ్యాస్‌లో ఉండే బాబాసావన్ సింహ్ అనో అనుకోకు. అట్లా అనుకుంటే నీ నావ తీరం చేరదు. ఆ రూపాన్ని, "గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః - గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమః" అనుకో. అప్పుడు నీ పడవ తీరం చేరుతుంది. నువ్వు గమ్యం చేరతావు. ఈ గురువులు, ఈ మతాలు మనల్ని మూర్ఖుల్ని చేసి వారి వారి ఆలోచనల్లో, వారి పద్ధతులో బంధించాలని చూడటం జరిగింది. మనల్ని స్వతంత్రుల్ని చెయ్యలేదు. సత్యం చెప్పలేదు. నేను సత్యాన్ని ఢంకా కొట్టి మరీ చెబుతున్నాను. నేను సంతు సద్గురు వక్తను. నేను ఇందుకోసమే ఫకీర్ శరీరంలోకి వచ్చాను. గురుమతంలోనికి వచ్చిన అనర్థాలను తొలగించడానికే అజ్ఞానంలో, భ్రమలలో అమాయకులైన జీవుల్ని పడదోసి తమ చుట్టూ తిప్పుకునే వారి నుండి జీవుల్ని విడదీసి సత్యం చాటి చెప్పాలనీ వచ్చాను. గురుమతం అంటే ఏమిటి? అసలైన గురువెవరు? నువ్వెక్కడికి వెళ్ళాలి? నీ గమ్యం ఏదీ వంటి విషయాల్ని మీకు వివరించడానికే వచ్చాను. నేడు

"కోమల్ చిత్త్ దయామన్ధారో
ఫిర్ పరమారథ్ కీ ఖోజ్ లగానా
ఇంద్రీ థాన్ విషయ్ కో త్యాగీ
సురత్ శబ్ద్ మే నిత్త్ లగానా" అనే శబ్దం విన్నాం. ఇప్పుడాలోచించు. నామం ఎవరికి అవసరం?

విషయోన్ సె జో హోయ్ ఉదాసా-పరమారథ్ కె జామన్ ఆసా
ధన్ సంతాన్ ప్రీత్ నాహి జాకే
ఖోజత్ ఫిర్ సాధ్ గురు జాగె

ఎందరో తల్లులు వస్తుంటారు. మనువడు పుట్టలేదు. మునిమనవణ్ణి ఎత్తుకోవాలనుంది అంటూ. ధన-సంతానం పట్ల ప్రీతిని పెంచుకోరాదని సంతులు చెబితే వీళ్ళంతా మనవళ్ళు కావాలనీ, సంతానం కావాలనీ వస్తుంటారు. వాళ్ళని విపరీతంగా ప్రేమిస్తుంటారు. ఇదా పరమార్థం? వీరు పరమార్థం పొందటం

అసంభవం. నామం ఇవ్వడానికి, నామ దానం చెయ్యడానికి ఇలాంటి వాళ్ళు అర్హులు కారు. ఇవ్వకూడదు. అందుకే నేను నామదానం ఇవ్వను.

విషయోన్ సె జో హోయ్ ఉదాసా-పరమారథ్ కె జామన్ ఆసా
ధన్ సంతాన్ ప్రీత్ నాహి జాకె
ఖోజత్ ఫిర్ సాధ్ గురు జాగె

మీరే చెప్పండి. మీరు నామదానం తీసుకుంటారు. ఆ తరువాత జీవితమంతా విషయ భోగాలలో గడుపుతుంటారు. ఔనా? కాదా? నా ప్రశ్నకి జవాబిచ్చి మరీ మాట్లాడండి! నామం పొందాక విషయ భోగాలలో గడుపుతున్నారు. మీరే కాదు. నా విషయంలోనూ అంతే జరిగింది. కానీ నేను వాటి లోనుండి బయటపడ్డాను. అసలు పరమార్థం నా మేధస్సుకు అర్థమైంది. బసరే బాగ్దాద్‌లో నేనున్నప్పుడు ఎంతో తేజస్సుతో ఉండేవాణ్ణి. కావాలంటే అప్పటి 'ఫోటో' చూడండి మీకే తెలుస్తుంది. ఇంటికి వచ్చాను. సంతానం లేదు. సంతానాన్ని కనమని దాతా ఆదేశించాడు. కేవలం సంతానం కోసమే నేను నా భార్య దగ్గరికి వెళ్తే దుఃఖం కలిగించే విషయమేమీ కాదు. కాని నేను విషయ భోగాల్లో మునిగాను. నా శాంతి అంతా మటుమాయమైంది. నా ముఖంపైగల ప్రకాశం అంతా అదృశ్యమై పోయింది. నాకేమైందో బోధపడేది కాదు. అర్థమైన తరువాత సంభాళించుకుని కోలుకున్నాను. ముగ్గురు, ముగ్గురు, నలుగురు, నలుగురు పిల్లలున్న సత్సంగీయులు కూడా నామం కోసం వస్తారు. ఇక వాళ్ళు విషయ వికారాలు పూర్తిగా మానెయ్యాలి.

స్వామీజీ అన్నాడు,

"ఇంద్రీథాన్ విషయ్ కో త్యాగో
సురత్ శబ్దమే నిత్త్ లగానా"

భజన్, ధ్యానం కుదరటం లేదు. పరమార్థం దొరకలేదు అంటూ వయసు మళ్ళిన వాళ్ళంతా ఫిర్యాదులు చేస్తుంటారు. వారికి నేను జవాబివ్వదలిచాను. 'భజన' కు కావాల్సిన, ఉండాల్సిన నియమాల్ని పాటిస్తున్నారా? ధ్యానం, భజన కుదరాలంటే ఏం చెయ్యాలి?

జహాఁ కామ్ వహాఁ నామ్ నహీ
జహా నామ్ వహాఁ నహీ కామ్
రవి రజని దోనో నా మిలే
ఏక్ ఠౌర్ ఏక్ యామ్

అందుకే నామాన్ని అడిగిన వారికల్లా ఇవ్వకూడదు. పిల్లలకు ఒక రకం శిక్షణ అవసరమైతే యుక్త వయసులో ఉన్నవారికి మరొక రకం శిక్షణ అవసరం. గృహస్థ ధర్మాన్ని విడిచి పెట్టమని నేనటం లేదు. కానీ ప్రతి దానికొక 'సమయం' ఉంటుంది. ప్రస్తుతం ఏం రివాజు వ్యాప్తిలోకి వచ్చింది? పిల్లలు కలగకుండా ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఇక నిశ్చింతగా ఇష్టం వచ్చినట్లు విషయ భోగాల్లో మునిగి తేలుతుంటారు. ఇలాంటి వారికి పరమార్థం లభిస్తుందా? లభించదు గాక లభించదు. పరమార్థం అంటే ఏమిటి?

సార్ పదారథ్ గురు సె పావో
చరణ్ కమల్ మే ప్రీత్ బఢానా

సార్ పదారథ్, అసలియత్, హకీకత్ వాస్తవం అంటే ఏమిటి? సారపదార్థం అంటే నాకు తెలిసేది కాదు. దాతా బోధించినా ఆయన నుండి నాకే సార్‌పదార్థం దొరకలేదు. ఆయన సూక్ష్మంగా బోధించినా నేను అర్థం చేసుకోలేకపోయే వాణ్ణి. ఆ సార్ పదారథ్‌ని బోధించడానికే నాకీ పని ఇవ్వబడింది. ఓ సత్సంగీయులారా! అది నాకు మీనుండే లభించింది. నా రూపం మీ అంతరంలో, అభ్యాసంలో కన్పించిందని మీరు చెబుతుంటారు. చనిపోయేటప్పుడు తీసుకుపోతానని చెబుతారు. అది నేను కాను కనుక ఆ సారపదారథ్‌ను వెదకడానికి వివశుడినవుతాను. నా రూపం మీలో ప్రకటమైంది. అది నేను కాదు. మరి నాలో ప్రగటమైనది కూడా వాస్తవానికి అవి కావు. అవన్నీ నా మనస్సు యొక్క లీలలే! ఆలోచనలే! ఎలాంటి సంస్కారాలు నా మెదడులో ఉన్నాయో అవే కన్పించాయి అంతే! ఇక నేను మనసును విడిచి ముందుకు వెళ్ళాను. అక్కడ కేవలం ప్రకాశం, శబ్దం మాత్రమే ఉంటాయి. మనసు ఆలోచనా విచారాలు, మనసు యొక్క శకలాలే అంటే ఆకృతులలో చిక్కుకుపోవడం, తనను తాను మనసు నుండి పైకి అంటే ప్రకాశ, శబ్దాల లోకి తీసుకు వెళ్ళడమే సార్‌పదారథ్ అని నాకు బోధపడింది. స్వామీజీ యొక్క సారపదారథ్ ఇదేనో కాదో నాకు తెలియదు. "సార్ పదారథ్ గురుసేపావో" అన్నాడాయన. అయితే నా గురువు ఎవరు? సార్ పదార్థ మెవరిచ్చారు? ఓ సత్సంగీయులారా! మీరే నా సత్యమైన గురువులు. మీ చరణాల కారణంగానే నేను సార్‌పదారథ్, వాస్తవ రహస్యాన్ని తెలుసుకోగలిగాను. ఎవరైనా మహాత్ములు ఇలాంటి మాటలు చెబుతారా? నిర్భయుడై ఇలా ఉపన్యసించే సంత్ ఉన్నాడా? నేను సంత్ సద్‌గురు వక్తని. నేను చెబుతున్నాను. సత్యమైన జ్ఞానాన్నే సద్గురువంటారు. పరమార్థ సంబంధమైన, సత్యమైన జ్ఞానాన్నే 'రుహానీ సంత్ సద్గురు' అనగా "ఆత్మిక సంత్ సత్‌గురు" అని అంటారు. ప్రస్తుతం ఏ

వస్తువు అవసరం ఉందో దాన్నే నేను చెబుతున్నాను. దీనికి అర్హులు ఎవరు? విషయభోగాల్లో చిక్కుకోకు అని పదే పదే చెబుతున్నాను. దంపతులకు నేనిచ్చే సలహా ఒక్కటే! సత్సంతానాన్ని కనండి. ఏ సంస్కారాలతో స్త్రీ పురుషులు కలిస్తే ఆ సంస్కారాలే పిల్లల్లో ప్రవేశిస్తాయి. వారిలో వ్యాపిస్తాయి. మామిడి టెంకను వాము నీళ్ళలో ముంచి 24 గంటలు ఉంచండి. తరువాత ఆ మామిడి టెంకను నాటండి. ఆ మామిడి చెట్టుకు కాసిన పళ్ళల్లో సోంప్ లేదా వాము సువాసన వస్తుంది. ఇదే స్థితి మనిషిది కూడా! ఓ తల్లులారా! బిడ్డలారా! రాష్ట్రాన్ని, మానవజాతిని, తయారు చేసేది మీరే! నాయకులు, లీడర్లు జాతిని తయారు చెయ్యలేరు. నేతలు చెయ్యగలిగితే గాంధీజీ అందర్నీ మంచి వాళ్ళుగానే మార్చిపోయేవాడు. కేవలం తల్లులే జాతి నిర్మాతలు. ఎటువంటి సంతతి కావాలనుకుంటే అటువంటి సంతతిని పొందే అవకాశం ఉంది. మనిషి ఆలోచనా విచారాలు పనిచేస్తుంటాయి. ఏ రకమైన ఆలోచనతో నీవు బిడ్డని గర్భంలో ధరించావో, గర్భంలో పోషించావో, ఎటువంటి సంస్కారాలతో నీవు పాలు అందించావో ఆ సంస్కారాలే పిల్లలలోకి చేరుతాయి. వందమందిలో ఇద్దరైనా మంచి సంతానాన్ని కంటే వేలాది జంతువులున్న అడవిలోకి ఒక పులి వచ్చినట్లే అవుతుంది. ఎందుకంటే వాటన్నిటికంటే ఇది ఉత్తమమైందీ, మృగాలకే రాజు గనుక! స్పృహ తెచ్చుకుని మాట్లాడండి. నేను సిగ్గు విడిచి అన్నీ స్పష్టంగా చెబుతున్నది నా బాధ్యత కారణంగానే. సత్సంతానం కావాలనే అభిలాషతో నేనొక పుత్రుణ్ణి కన్నాను. అతన్ని ఈ రోజు వరకు ఓ చెంప దెబ్బ వెయ్యటం గానీ, మందలించే అవకాశం గానీ నాకు కలుగలేదు. మిగతా సంతానాన్ని మీరు కన్నట్టే కన్నాను. నా భార్య ఆలోచనలు ఎలా ఉండేవో నాకు తెలియవు కానీ సత్సంతానం కావాలనే కోర్కెతో ఈ పిల్లవాణ్ణి కన్నాను. నేను మీకు పారమార్థిక విషయాలతో పాటు, ప్రాపంచిక విషయాల్ని కలిపి చెబుతున్నాను. దీని వలన మీకు అభివృద్ధి కలిగి శుభం జరుగుతుందని నా నమ్మకం.

ధారా అగమ్ పకడ్ సుర్త్ జోడీ
ఇస్ సత్సంగ్ మే సదా సమానా

జ్ఞానాన్నే అగం అని కూడా అంటారు. నేను మీలో ప్రకటమవుతున్నానని నాకు మీరు చెప్పగానే మనస్సు విచారాల్నీ విడిపోయాయి. ఇప్పుడు అగంధారా ఏమైంది? నేను ప్రకాశంలోకి వెళ్ళిపోతాను. శబ్ద్ వింటాను. ఏ వస్తువైతే నాలో ఉంటూ ప్రకాశాన్నీ చూస్తున్నదో, శబ్దాన్ని వింటున్నదో అదే అగమ్. ధారా అగమ్ అంటే ఏమిటి? ఓ మనిషీ నీ అసలు రూపాన్ని నీలో దర్శించు. మరణ

సమయంలోనో, మరొకప్పుడో నీ ఎదుట నీ గురువు కన్పించినంత మాత్రాన జనన మరణాల చక్రం నుండి తప్పించుకుంటానని పొరబడకు. నీవు అగను లోకానికి చేరుకోలేవు. నేను పై స్థాయిలో చెబుతున్నానని నాకు తెలుసు. కానీ నిజంగానే ఈ ప్రపంచం నుండి బయటపడాలనుకునే వారి కోసం చెప్పక తప్పదు.

"ధారా అగమ్ పకడ్ సుర్త్ జోడీ
ఇస్ సత్సంగ్ మే సదా సమానా"

సత్సంగం అంటే ఏమిటి? సత్ యొక్క సాంగత్యం. సత్ ఏది? శబ్దంలో ఉంటూ శబ్దాన్నీ వినేదీ, ప్రకాశంలో ఉంటూ ప్రకాశాన్ని చూసేదీ ఏ వస్తు వుందో అదే నీలోని సత్. దాని సాంగత్యం కోసం తపించు. ప్రయత్నించు. నిన్ను నీవు నీతో కలపటమే అసలైన సత్సంగం. ఇక బయటి సత్సంగమా? నిర్బంధ పురుషుని సత్సంగంలో పాల్గొనండి.

"బంధే కో బంధా మిలె - ఛటె కౌన్ ఉపాయ్।
కర్ సత్సంగత్ నిర్బంధ్ కీ - జో పలక్ లే ఛడాయా॥

ఏ గురువులైతే బంధనాల నుండి విడివడలేదో వారి సత్సంగానికి వెళ్తుంటారు మీరంతా. కొందరు మిమ్మల్ని తమతో బంధిస్తారు. అంటే తమ పట్ల విపరీత శ్రద్ధ భావం ఏర్పడేలా మిమ్మల్ని బిగిస్తారు. మరికొందరు సంస్థతో ముడివేసి బంధిస్తారు. కొందరు నిన్ను మతంతో ముడివేసి బంధిస్తారు. కానీ నేను నిర్బంధ పురుషుణ్ణి. ఔనా! అయినా ఇంకా నాలో రెండు లేక మూడు శాతం వరకు నాలో కూడా లోపం ఉంది. అందుకే ప్రయత్నిస్తుంటాను.

చలీ సురత్ నభ్ ద్వారా ఝాంకా ।
అండా తీన్ లోక్ దర్సానా ॥

నాపై దాతా దయ చూపించాడు. మీరు నాపై ఎలాంటి దయ చూపించారో మీకు తెలియదు. నేను దాన్ని జీవితాంతం మరిచిపోలేను. సంత్ మతంలో ఏం రహస్యం ఉందో తెలుసుకోవాలనుకున్నాను. అది బోధపడేది కాదు. 'గురువును సేవించమని' జవాబు రాశాడు దాతా దయాల్. అంటే నేను బాహ్య గురువును సేవించమన్నాడనే భ్రమలో పడి బంగారు కిరీటాన్ని చేయించాను. వెండి హుక్కాను చేయించాను. ఇలాంటి వెన్నో చేశాను. కానీ అసలు విషయం బోధపడలేదు. అది నాకు బోధపడడానికే ఈ సత్సంగం చేసే పని అప్పగించబడింది.

నేను ఏ రహస్యాన్ని విప్పి చెబుతున్నానో పూర్వం ఎవరూ ఇలా చెప్పలేదు. కేవలం అర్హుడైన శిష్యునికే ఇది పరిమితంగా ఉండేది. ధర్మదాసుకు ఈ రహస్యాన్ని కబీర్ చెప్పాడు. కానీ నోరు మూసేశాడు ఎలాగ?

"ధర్మదాస్ తోహే లాభ్ దోహాయీ ।
సార్ భేద్ నాహి బాహర్ జాఈ ॥ అన్నాడు.

ధర్మదాసు ఇంకెవరికీ చెప్పకూడదని ఆనతిచ్చాడు కబీర్. స్వామీజీ దీని గురించి ఇలా రాశాడు.

సంత్ బినా కోయీ భేద్ న జానే
వహ తోహె కహె అలగ్ మే "

నేను ఆ రహస్యాన్ని విప్పాను. మంచే చేశానో, చెడే చేశానో నాకు తెలియదు. శరీరం త్యజించే ముందు శిక్షణలో మార్పు తెమ్మని దాతా చెప్పాడు. కనుక చెబుతున్నాను. నాకు బోధపడినవీ, అనుభవంలోకి వచ్చిన విషయాలే చెబుతున్నాను.

పర్ జాయ్ బ్రహ్మాండ్ సమానీ
సున్ సరోవర్ కమల్ ఖిలానా
అబ్ తో కాల్ కలా సబ్ హారా .
మాన్ సరోవర్ బైర్ అన్‌హానా

ఈ 'కాల్' అంటే ఏమిటి? నీ మనస్సే. మనసును విడిచి పెట్టేస్తే సంకల్పాలు తొలగిపోయాక ఈ కాల్ అనగా మనసు ఏం చేస్తుంది? ఏ స్థితిలో మనసు సంకల్పాల్ని చెయ్యడం మానేస్తుందో ఆ స్థితి పేరే మహాసు.

అక్షర్ రూప్ నిరఖ్‌తిచాలీ ।
ఛోడ్ దియా అబ్ దేశ్ బిగానా ॥

ఇప్పుడు చూడండి. క్షర్, అక్షర్, నిర్అక్షర్. నా మనస్సులో ఎన్ని ఆలోచనా, విచారాలు భ్రమణాలు, ఆకారాలు ఉండేవోరూపు ఏర్పర్చుకున్నాయో ఇవన్నీ అక్షర్. వీటిని విడిచి పెట్టేశాను. ఇది నా దేశం కాదు. నా ఊరు కాదు. నా ఇల్లు కాదు. దీనికతీతమైనది నా దేశం, నా గమ్యం. నేనూ 'అక్షర్'లో చిక్కుకుని ఉండేవాణ్ణి. జీవితంలో చాలా భాగం 'అక్షర్'లోనే చిక్కుకునే గడిపాను. దాతా దయాలుని రూపం ఎదుటికి వచ్చేది. నేను ఆనందంతో నృత్యం చేసేవాణ్ణి.

మనస్సు లోపలే  కాదు బయట కూడా! అదంతా ఆ 'అక్షర్' రూపం యొక్క లీల, విన్యాసాలే! అది నా గమ్యంకాదనీ, నా నిజ గృహం కాదనీ అంతా మనసు, మాయల సుడిగుండం అని ఇప్పుడు బోధపడింది.

సురత్ సాఫ్ ఉడీ ఊంచే కో ।
ఛట్ గయా సబ్ మహల్ పురానా ॥

సురత్ దీనిని విడిచిపెట్టి ఎక్కడికి పోతుంది? మనసు, శరీరంలను మరిచిపోతుంది.

ఆగే చఢ్  చఢ్ అథర్ సమానీ ।
శబ్ద్ శబ్ద్ కా మర్మ్ పిఛానీ ॥

ఇది నాకు అర్థం అయ్యేది కాదు. మీ దయ వల్ల బోధపడింది. నా మందిరానికి దుఃఖితులు వస్తుంటారు. వారిలో నా రూపం ప్రకటించిందని చెబుతుంటారు. నేను వారిని సేవిస్తుంటాను. అంతే!

సంత్ బినా కోయీ సమ్‌ఝే నాహి ।
ఆగె జో జో భేద్ దిఖానా ॥

దీని తరువాత ఏముందో సంతు తప్ప ఎవరూ అర్థం చేసుకోలేరని అంటున్నాడు. కానీ నిజానికి ఆయన రాసింది కూడా సంత్ వినా ఎవరూ అర్థం చేసుకోలేరు.

కహనే మే ఆవే నహి పూరా ।
ఉల్టా సుల్టా కరత్ బఖానా ॥
వాచక్ అప్‌నీ ఉక్తి లగావే ।
అమల్ బినా నహి బూఝ్ బూఝానా ॥

ఆచరణంలో  చూపించటం ముఖ్యం. నీ అంతరంలో మనసును దాటి పోవాలి.

సంతన్ కీ గతి సంతహి జానే ।
ఔర్ కహో కైసె పహచానా ॥
అప్‌నీ ఉక్తి చతురతా త్యాగో ।
సంత్ వచన్ కో కరో ప్రమానా ॥

వహ కహతే దేఖీ నిజ అపనీ ।
తూ సున్ సున్ క్యా బుద్ధి లడానా ॥

నేను నా అనుభవంలోకి వచ్చిన అంశాల్నే చెబుతున్నాను. పుస్తకాల్లోనివి కావు.

రాధాస్వామీ సబ్‌సే కహతే ।
సంత్ భేద్ కోర్‌భేదీ జానా ॥

నేను ఆ రహస్యం తెలుసుకున్నాను. దాతా దయవల్ల, మీ దయవల్ల తెలుసుకున్నాను. ఇక్కడ ఒక స్త్రీ, ఒక పురుషుడు నానక్ చంద్‌లు చనిపోయారు. వీరిని నా గురువులనుకుంటాను. వారిలో నా రూపం ప్రకటమైందని వీరు నాకు ఉత్తరాలు రాశారు. అది నేను కాను. నా కళ్ళు తెరుచుకున్నాయి. నా కళ్ళు తెరిపించిన మీరు నా సత్ గురువులయ్యారా లేదా? ఇక ముందుకు వెళ్ళడానికి వివశుడినయ్యాను. ఇదే రహస్యం. ఎవరూ విప్పిచెప్పరు. నేను చెప్పాను.

నేనొచ్చాను. మీరు వచ్చారు. నేను మీకు ప్రపంచంలోని విషయాలు చెప్పాను. బిడ్డల్లారా! చెల్లెళ్ళారా! తమ్ముళ్ళారా! జగింద్ర్! మీరంతా నాకు ప్రేమ పంచారు. నా దగ్గర నా జీవితానుభవాలున్నాయి. వచ్చినప్పుడల్లా వాటిని వ్యక్తం చేస్తూనే ఉన్నాను. ఒకటి. రెండోది. నా దగ్గర శుభ భావనలున్నాయి. జగింద్ర్! నీకు శారీరిక కష్టాలు కలుగకూడదని సత్యమైన మనస్సుతో కోరుకుంటున్నాను.

మృత్యువు పట్ల నాకేం భయం లేదు. ఎందుకంటే వచ్చినవాడు వెళ్ళిపోవలసిందే! నీ దేహానికి బాధలు కలుగకూడదని ఆశిస్తున్నాను. అంతే! నీ స్థితిగతులు బాగున్నాయి. పిల్లలు బాగున్నారు. చింతించే అవసరం లేదు. మీరొస్తారు. మీ అందరికీ శుభం జరగాలని నేను కోరుతాను. విశ్వాసం పెట్టుకోండి. మీ మనోకామనలన్నీ పూర్తవుతాయి.

**అందరికీ శాంతి - అందరికీ రాధాస్వామి**

# వందన

చరణ శరణకీ వందనా నిత్ కోయి ఔర్ న కామ్ ।
గురుబసోచిత్ ఆయే మేరే బక్షదోనిజనామ్ ॥1॥

తేరీ శరణాగత హూవా ఫిర్ కిసికీ రాఖూం ఆస్ ।
ఆస్ తో తేరీ దయాకీ జగ్‌సే రహూం ఉదాస్ ॥2॥

రూపధ్యావూం నామగావూం శబ్దరాతామన్
ఆఠోం యామ్ తేరాహీ సుమరణ భాగ్య మేరాధన్ ॥3॥

శీష్ పర్ నిజకర్ కమల్ ధర్ లియా చరణలగాయ్ ।
పతిత పాపీ తర్‌గయా గురు శరణ తేరీ ఆయ్ ॥4॥

ముక్తికీ నహిం చాహమన్ మే భక్తిప్యారీ లాగ్
రాధాస్వామీ కీ దయాసే భాగ్య పూరణ జాగ్ ॥5॥